క్లుప్తంగా

పోలీస్ స్పందనలో 55 ఫిర్యాదులు



విజయవాడ స్పోర్ట్స్:ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్‌లో సోమవారం నిర్వహించిన స్పందనలో 55 మంది బాధితులు ఫిర్యాదులు అందజేశారు. నగదు లావాదేవీలపై 14, కుటుంబ కలహాలపై ఏడు, ఆస్తి వివాదాలపై ఏడు, మోసాలపై ఎనిమిది, ఇతర సమస్యలపై 19 మంది ఫిర్యాదులు ఇచ్చారు. డీసీపీ మేరీ ప్రశాంతి ఫిర్యాదులను స్వీకరించిన అనంతరం బాధితులతో మాట్లాడారు. ఫిర్యాదులను నిర్ణీత కాల వ్యవధిలో పరిష్కరించాలని సంబంధిత అధికారులను డీసీపీ ఆదేశించారు.

రేపు ఉగాది పురస్కారాలు ప్రదానం

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): మల్లాది వెంకట సుబ్బారావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 22వ తేదీన తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఉగాది పురస్కారాలు ప్రదానం చేయనున్నట్లు రాష్ట్ర ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. జ్యోతిష్య విశారద, రాష్ట్ర దేవదాయ ధర్మాదాయ శాఖ ఆస్థాన సిద్ధాంతి బ్రహ్మశ్రీ కప్పగంతుల సుబ్బరామ సోమయాజులతో పంచాంగ శ్రవణం, విష్ణు సహస్రనామ పారాయణం, కళాకారులచే సాంస్కృతిక కార్యక్రమాలు, వేద పండితులచే వేద స్వస్తి కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. అనంతరం పలు రంగాల్లో విశిష్ట ప్రతిభను కనబర్చిన ప్రముఖులను పురస్కారాలతో సత్కరించనున్నామన్నారు. నగర ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ఆహార పొట్లాలు పంపిణీ

మధురానగర్(విజయవాడసెంట్రల్):డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యాన రిటైర్డ్ ఎస్‌బీఐ మేనేజర్ బీ రవీంద్రనాథ్ వర్ధంతి సందర్భంగా బీఆర్‌టీఎస్ రోడ్డులో నిరుపేదలకు ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ అధ్యక్షులు బి.వసంతకుమార్ మాట్లాడుతూ ఆకలితో ఉన్నవారి కడుపు నింపటంలో ఉన్న సంతృప్తి ఎందులోను లభించదన్నారు. సుమారు 100 మందికి ఆహార పొట్లాలు అందజేశారు. ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి కె.రాము, కోశాధికారి జి.ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

పాయకాపురం(విజయవాడరూరల్): జనంలో మనం అనే స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సోమవారం ప్రకాష్‌నగర్‌లో పేదలకు అన్నదానం నిర్వహించింది. ప్రతి నెలా 20వ తేదీన పేదలకు అన్నదానం చేస్తామని నిర్వాహకులు పొదిగింటి నాగరాజు తెలిపారు. ఇప్పటి వరకు కృష్ణ, గుంటూరు జిల్లాల్లోని వివిధ ప్రాంతాల్లో 10 వేల మందికి అన్నదానం చేశామని పేర్కొన్నారు.

30 నుంచి శ్రీరామనవమి వేడుకలు

మధురానగర్(విజయవాడసెంట్రల్):దుర్గాపురం కోదండ రామాలయం, షిరిడీ సాయిబాబా మందిరంలో 30వ తేదీ నుంచి శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 30వ తేదీ గురువారం శ్రీరామనవమి సందర్భంగా ఉదయం 9.30 గంటల నుంచి సీతారాముల కల్యాణోత్సవం ప్రారంభమవుతుందన్నారు. సాయంత్రం 7 గంటలనుంచి షిరిడీ సాయి చందనోత్సవం జరుగుతుందన్నారు. 31వ తేదీ శుక్రవారం సీతారాములకు విశేష అర్చనలు సాయంత్రం సీతారాముల కళ్యాణమూర్తుల నగరోత్సవం మేళతాళాలు, డప్పువాయిద్యాలతో కొనసాగుతుందని పేర్కొన్నారు. వచ్చేనెల ఒకటోతేదీన ప్రత్యేక పూజలు, అర్చనలు సాయంత్రం పవలింపు సేవ నిర్వహిస్తామన్నారు. 2వ తేదీ మధ్యాహ్నం కందగట్ల వీరాస్వామి దంపతులచే అన్నప్రసాద వితరణ జరుగుతుందన్నారు. భక్తులు శ్రీరామనవమి వేడుకల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

నేడు త్రిదండి చిన్న రామానుజ జీయర్‌స్వామి రాక

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు షిరిడీ సాయిబాబా మందిరను మంగళవారం త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్‌స్వామి సందర్శించనున్నట్లు ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. లోక కళ్యాణార్థం ఈ నెల 28వ తేదీన మందిరంలో నిర్వహించ తలపెట్టిన కోటి రుద్రాక్ష అభిషేకం రుద్రాక్షలను జీయర్‌స్వామివారు దర్శించుకుని రుద్రాక్షల విశిష్టతను భక్తులకు వివరిస్తారన్నారు. భక్తులు ఈ సదవకాశంను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వారంలో ఒక రోజు డ్రైడేగా పాటించాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్):ప్రతి ఒక్కరూ వారంలో ఒక రోజు డ్రైడేగా పాటించాలని 31వ డివిజన్ కార్పొరేటర్ పెనుమత్స శిరీష సత్యం సూచించారు. పసుపుతోటలో సోమవారం సాయంత్రం మలేరియా విభాగం ఆధ్వర్యాన దోమల నియంత్రణకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. మలేరియా ఇన్‌స్పెక్టర్ కర్నాటి నరసింహారావు దోమల నివారణకు సహకరించాలని కోరారు. అనంతరం మురుగుకాలువలులో దోమల నివారణ మందు స్ప్రే చేశారు. వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జి పెనుమత్స సత్యం తదితరులు పాల్గొన్నారు.







• సిద్ధమవుతున్న హలీం సెంటర్లు!

ఈ నెల 23 నుంచి పవిత్ర రంజాన్ మాసం ప్రారంభం అవుతున్న నేపథ్యంలో విజయవాడలో హలీం సెంటర్లు నెలకొల్పేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. వన్‌టౌన్ పంజా సెంటర్‌లో హలీం కేంద్రాలతో పాటు వివిధ రకాల ఫుడ్ స్టాల్స్ పెట్టేందుకు సిద్ధమవుతున్న దుకాణాల చిత్రాలివి.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

హౌసింగ్ పీడీ శ్రీదేవి సేవలు స్ఫూర్తిదాయకం



పీడీ శ్రీదేవిని సత్కరిస్తున్న కలెక్టర్ ఎస్ ఢిల్లీరావు

జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్):పేదవాని సొంతింటి కల నెరవేర్చాలన్న ప్రభుత్వ లక్ష్యాన్ని సాధించడంలో గృహ నిర్మాణ శాఖ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ వి. శ్రీదేవి అందించిన సేవలు స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు తెలిపారు. గృహ నిర్మాణ శాఖ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్‌గా పదవీ బాధ్యతలు నిర్వహిస్తున్న శ్రీదేవి బదిలీ సందర్భంగా సోమవారం కలెక్టరేట్ పింగళి వెంకయ్య స్పందన సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు, జాయింట్ కలెక్టర్ శ్రీవాస్‌నుపూర్ అజయ్ కుమార్ జిల్లా అధికారులతో కలిసి ఆమెను సత్కరించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గృహ నిర్మాణ శాఖలో 40 సంవత్సరాలుగా శ్రీదేవి సుదీర్ఘ సేవలు అందిస్తున్నారని చెప్పారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలో గత 4 సంవత్సరాలుగా విశిష్ట సేవలు అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. జిల్లాల పునర్విభజన అనంతరం ఎన్టీఆర్ జిల్లా పీడీ గా పదవీ బాధ్యతలు చేపట్టి జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయడంలో తనదైన శైలిలో సేవలు అందించారన్నారు. అందరినీ సమన్వయం చేసుకుంటూ తన శాఖలో ప్రగతి చూపారన్నారు. గృహ నిర్మాణ శాఖ నూతన ప్రాజెక్టు డైరెక్టర్ గా నియమితులైన యం. రజనీ కుమారి సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఆమెకు పలువురు జిల్లా అధికారులు అభినందనలు తెలిపారు. ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీదేవిని సన్మానించిన వారిలో డీఆర్వో కె. మోహన్ కుమార్, డ్వామా పీడీ జె. సునీత, ఐసిడిఎస్ పిడీ జి. ఉమాదేవి, డిఎస్వో కె. కోమలి పద్మ, మార్క్ ఫెడ్ నాగమల్లిక, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి యం.విజయభారతి, సిపిఓ రత్నరూత్, గ్రామ వార్డు సచివాలయ ప్రత్యేక అధికారి కె. అనురాధ, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ ఎన్ వి.విజయభారతి తదితరులు ఉన్నారు.

నిర్ణీత గడువులోగా స్పందన సమస్యలకు పరిష్కారం

పటమట(విజయవాడతూర్పు):విజయవాడ నగర పాలక సంస్థ పరిధిలోని పలు ప్రాంతాల్లో వీఎంసీ అందిస్తున్న మౌలిక సదుపాయాల కల్పనలో అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్ అధికారులకు సూచిచారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో సోమవారం స్పందన నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. స్పందనలో వచ్చిన అర్జీలను నిర్దీత గడువులోగా పరిష్కరించాలని మేయర్ ఆదేశిస్తూ, ప్రతివారం సమీక్షలో పరిష్కారమైన సమస్యల నివేదిక ఇవ్వాలని కమిషనర్ ఆదేశించారు. స్పందనలో ఇంజినీరింగ్ విభాగంపై - 9, పట్టణ ప్రణాళిక విభాగం - 3, పబ్లిక్ హెల్త్ విభాగం - 3, రెవిన్యూ - 4, జాయింట్ డైరెక్టర్ (అమృత్) - 2పై అర్జీలు వచ్చాయి. అదనపు కమిషనర్ (జనరల్) యం.శ్యామల, అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్స్) కె.వి సత్యవతి, చీఫ్ ఇంజినీర్ యం.ప్రభాకర రావు, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.రత్నావళి, సిటీ ప్లానర్ జి.వి.జి.ఎస్.వి ప్రసాద్, డెప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) డి.వెంకటలక్ష్మి, పట్టణ సాధికారాభివృద్ధి విభాగం ప్రాజెక్ట్ ఆఫీసర్ (యు.సి.డి) శకుంతల, జాయింట్ డైరెక్టర్ (అమృత్) డాక్టర్ కె.బి.ఎస్.ఎస్ లతా, ఏ.డి.హెచ్ శ్రీనివాసు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు నారాయణమూర్తి, ఏ.ఎస్.ఎన్ ప్రసాద్, మేనేజర్ బి.శ్రీనివాస్ రావు ఇతర అధికారులు పాల్గొన్నారు. సర్కిల్ కార్యాలయాల్లో జోనల్ కమిషనర్లు నిర్వహించిన స్పందనలో చిట్టినగర్‌లోని సర్కిల్ - 1 కార్యాలయంలో ఇంజినీరింగ్ విభాగం - 1, పట్టణ ప్రణాళిక విభాగం-1 అర్జీలు రాగా సత్యనారాయణపురంలోని సర్కిల్ - 2 కార్యాలయంలో ఇంజినీరింగ్ విభాగం - 1, పట్టణ ప్రణాళిక విభాగం - 1, రెవిన్యూ - 1 అర్జీ వచ్చాయి. పటమటలోని సర్కిల్ - 3 కార్యాలయంలో పట్టణ ప్రణాళిక విభాగం-1 అర్జీ వచ్చింది.



స్పందనలో అర్జీలను స్వీకరిస్తున్న మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కమిషనర్ స్వప్నిల్ దినకర్

62 మందికి ఉచితంగా కంటి ఆపరేషన్లు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ):ఆంధ్రా బ్యాంక్ శతజయంతి ఉత్సవాలను పురస్కరించుకుని ఆంధ్రా బ్యాంక్ రిటైర్డ్ ఉద్యోగుల అసోసియేషన్, విన్ విజన్ కంటి హాస్పటల్ ఆధ్వర్యంలో సోమవారం 62 మందికి ఉచితంగా కంటి ఆపరేషన్లు నిర్వహించారు. గొల్లపూడిలోని ఆశా హాస్పటల్‌లో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో గొల్లపూడి, ఇబ్రహీంపట్నం, కొండపల్లి పరిసర ప్రాంతాలకు చెందిన 123 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు చేశారు. అందులో 62 మందికి కంటి సమస్యలు ఉన్నట్లు గుర్తించిన వైద్యులు వారికి సోమవారం కేటరాక్ట్ ఆపరేషన్లు నిర్వహించారు. విన్ విజన్ కంటి హాస్పటల్‌కు చెందిన కంటి వైద్య నిపుణులు డాక్టర్ నిషాంత్, డాక్టర్ హారికల ఆధ్వర్యంలో పలు దఫాలుగా ఆపరేషన్లు నిర్వహించినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఆపరేషన్ జరిగిన వారికి ఉచితంగా కళ్ళజోళ్ళు అందించామన్నారు. విన్‌విజన్ కంటి హాస్పటల్ నిర్వహణాదికారి డి.అంజిబాబు, ఆంధ్రాబ్యాంక్ విశ్రాంత ఉద్యోగుల ప్రతినిధులు నిడుమోలు కృష్ణమోహన్, ఎంవీఎస్. శర్మ తదితరులు పర్యవేక్షించారు.



కంటి ఆపరేషన్లు చేయించుకున్న వృద్ధులు

విద్యార్థులకు కలెక్టర్ ఢిల్లీరావు ఆదర్శనీయం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): నిరుపేద కుటుంబంలో జన్మించి ఎన్నో కష్టాలను ఎదురించి ఉన్నత శిఖరాలకు చేరి ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న సేనాపతి ఢిల్లీరావును స్ఫూర్తిదాయకంగా తీసుకోవాలని సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రశంసించడం తమకు ఎంతో గర్వకారణమని పలువురు జిల్లా అధికారులు పేర్కొన్నారు. తిరుపూరులో నిర్వహించిన జగనన్న విద్యాదీవెన కార్యక్రమంలో సీఎం వైఎస్ జగన్ ప్రశంసలు. అందుకున్న జిల్లా కలెక్టర్ ఢిల్లీరావును జిల్లా అధికారుల పక్షాన సోమవారం కలెక్టరేట్ లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు జిల్లా అధికారులు మాట్లాడుతూ.. శ్రీకాకుళం జిల్లా మారుమూల గ్రామంలో అతి నిరుపేద కుటుంబంలో జన్మించి ఉన్నత చదువులు చదివి కలెక్టర్‌గా ప్రజలకు సేవలందిస్తున్న కలెక్టర్ సేనాపతి ఢిల్లీరావును ఆదర్శంగా తీసుకుని ప్రభుత్వం అందించిన సహకారంతో ప్రతి విద్యార్థి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సీఎం వైఎస్ జగన్ విద్యార్థుల హర్షద్వానాల మధ్య ప్రశంసించారని చెప్పారు. ఇందుకు తాము తాము ఎంతో సంతోషిస్తున్నామని పేర్కొన్నారు. అత్యున్నత స్థానంలో ఉన్నప్పటికీ ఎటువంటి భేషజాలు లేకుండా ప్రజా ప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులను సమన్వయ పరచుకుంటూ జిల్లాను అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారన్నారు. కలెక్టర్ స్ఫూర్తితో తామంతా రాబోయే రోజుల్లో జిల్లా ప్రగతికి పాటుపడతామన్నారు. కలెక్టర్‌ను సత్కరించిన వారిలో జాయింట్ కలెక్టర్ శ్రీవాస్ నుపూర్, డీఆర్వో కె. మోహన్ కుమార్ పలువురు అధికారులు ఉన్నారు.



కలెక్టర్‌ను అభినందిస్తున్న జిల్లా యంత్రాంగం

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో సికింద్రాబాద్‌కు చెందిన కె.సహస్ర నైనికరెడ్డి ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై సోమవారం సాయంత్రం నైనికరెడ్డి పలు కీర్తనలకు చక్కటి నాట్యంతో అందరిని ఆకట్టుకున్నారు. అనంతరం నైనికరెడ్డికి అమ్మవారి దర్శనం కల్పించిన ఆలయ అధికారులు ప్రసాదాలు అందచేశారు.



నృత్య ప్రదర్శన ఇస్తున్న నైనికరెడ్డి

న్యాయవాదుల ఆందోళన

విజయవాడ స్పోర్ట్స్: న్యాయవాదులపై అక్రమ కేసులు బనాయించడాన్ని నిరసిస్తూ బెజవాడ బార్ అసోసియేషన్ (బీబీఏ) ప్రతినిధులు, న్యాయవాదులు సూర్యారావుపేటలోని కోర్టు ప్రాంగణం వద్ద సోమవారం ఆందోళన చేశారు. న్యాయవాది భగవాన్ తన పదేళ్ల కుమార్తెపై లైంగిక దాడికి యత్నించిన వ్యక్తిపై ఫిర్యాదు చేస్తే భవానీపురం పోలీసులు తిరిగి న్యాయవాదిపైనే కేసు నమోదు చేశారంటూ ఆరోపించారు. బాధ్యులైన భవానీపురం సీఐ ఉమర్, ఏఎస్ఐ గంగాధర్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం పోలీస్ కమిషనర్ టీకే రాణాకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బీబీఏ అధ్యక్షుడు చంద్రగిరి విష్ణువర్ధన్ మాట్లాడుతూ న్యాయవాది భగవాన్‌కు జరిగిన అన్యాయంపై తీవ్రంగా పోరాడతామన్నారు. అయితే కొన్ని రాజకీయ పార్టీల చోటా నాయకులు ఈ ఘటనను వారి రాజకీయ భవిష్యత్తుకు పునాదిగా వాడుకుంటూ ప్రభుత్వంపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. బార్ అసోసియేషన్‌లో రాజకీయాలకు తావులేదన్నారు. న్యాయవాదులకు అన్యాయం జరిగితే వెంటనే స్పందిస్తామన్నారు. ఈ ఆందోళనలో బీబీఏ కార్యదర్శి గంధం శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులు నిర్మల రాజేష్, బీబీఏ మాజీ ప్రతినిధులు మన్మధరావు, జయకర్ పాల్గొన్నారు.

12 టైర్ల లారీ దహనం

పాయకాపురం(విజయవాడరూరల్): గుర్తు తెలియని వ్యక్తులు 12 టైర్ల లారీని దహనం చేసిన ఘటన సోమవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. దంతల నరేంద్రకుమార్‌కు చెందిన లారీని ఈ నెల 17వ తేదీన కంట్రిక కేర్ అండ్ షేర్ స్కూల్ వద్ద పార్కు చేసి ఉంచాడు. సోమవారం తెల్లవారు జామున లారీ కాలిపోవడాన్ని గుర్తించి స్థానికులు నరేంద్రకు ఫోన్ చేసి చెప్పారు. ఆయన ఘటన స్థలానికి వచ్చి అగ్ని మాపక శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. అగ్ని మాపక సిబ్బంది వచ్చి మంటలు అదుపు చేశారు. గుర్తు తెలియని వ్యక్తులు తన లారీకి నిప్పు పెట్టినట్లు నరేంద్రకుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

యువతి అదృశ్యంపై కేసు

పాయకాపురం(విజయవాడరూరల్): యువతి అదృశ్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు. పాయకాపురం ప్రకాష్‌నగర్‌కు చెందిన యువతి ఆదివారం సాయంత్రం నుంచి కన్పించడం లేదని తల్లి ఫిర్యాదు చేసింది. ఇంటర్మీడియెట్ చదివి ఆమె ఇంటి వద్దే ఉంటుందని పేర్కొంది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కుమారుడి అదృశ్యంపై తల్లి ఫిర్యాదు

పాయకాపురం(విజయవాడరూరల్): చేపల వ్యాపారం చేసే తన కుమారుడు కనిపించడం లేదని తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నున్న పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. వాంబే కాలనీకి చెందిన తమ్మిశెట్టి రాఘవమ్మ కుమారుడు శివకిరణ్ (25)కు గత నెలలో వివాహం జరిగింది. ఈ నెల 16వ తేదీన రాత్రి 7 గంటలకు బయటకు వెళ్లి వస్తానని చెప్పి ఇంతవరకు తిరిగి రాలేదని తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టిప్పర్ ఢీకొని వ్యక్తి దుర్మరణం



పాయకాపురం(విజయవాడరూరల్): టిప్పర్ ఢీకొని వ్యక్తి దుర్మరణం చెందిన ఘటన నున్న గ్రామ శివారు బోడపాడు ఫ్లై ఓవర్ బ్రిడ్జి క్రింద సోమవారం చోటుచేసుకుంది. సీఐ కె. శ్రీనివాసరావు తెలిపిన వివరాల మేరకు... సుందరయ్యనగర్‌కు చెందిన గరికపాటి మల్లికార్జునరావు (45) ఐస్‌క్రీమ్ బండి పై వ్యాపారం చేస్తుంటాడు. సోమవారం సాయంత్రం బండిపై వస్తుండగా ఎదురుగా వస్తున్న టిప్పర్ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య గరికపాటి మాధవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

దోమల నియంత్రణకు చర్యలు

మధురానగర్(విజయవాడసెంట్రల్):రోజురోజుకు పెరుగుతున్న దోమల నియంత్రణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని 30వ డివిజన్ కార్పొరేటర్ బీహెచ్ఎస్‌వీ జానారెడ్డి కోరారు. 251వ వార్డు సచివాలయం పరిధిలో సోమవారం దోమల నివారణకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. శానిటరీ సెక్రటరీ సుధీర్ వైఎస్సార్ సీపీ నాయకులు దుర్గారావు, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సినీ నటుడు శోభన్‌బాబుకు స్వరాంజలి



సినీ గీతాలు పాడుతున్న గాయనీ గాయకులు

విజయవాడ కల్చరల్: సినీ నటుడు శోభన్ బాబు 15వ వర్ధంతి సందర్భంగా బీవీఆర్ ఆర్కెస్ట్రా ఆధ్వర్యంలో నిర్వహించిన స్వరాంజలి మధురంగా సాగింది. గాంధీనగర్ కౌతా పూర్ణానందం కళావేదికమీద సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో పలువురు గాయకులు పాల్గొన్నారు. బీవీ రామ్మోహన్ ఆధ్వర్యంలో మల్లాది స్వాతి, కొమ్మినేని రత్నకుమారి, వడ్డాది కామేశ్వరి, భారతి, షబానా, డేవిడ్‌రాజు, శివప్రసాద్ కుటుంబరావు, శోభన్ బాబు నటించిన సినిమాల్లోని పాటలను ఆలపించారు. తటవర్తి సూర్యనారాయణ, బీవీ వీరభద్రరావు, జ్యోతిష్య శాస్త్రవేత్త ప్రసూనా రామన్ బ్రాహ్మణ సంక్షేమ సంఘం నాయకులు బలరామకృష్ణమూర్తి, ఉమాబలరాం పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఆటల పోటీలు

విజయవాడ స్పోర్ట్స్:అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని కృష్ణలంక అమరజీవి పొట్టి శ్రీరాములు నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాల(ఏపీఎస్ఆర్ఎంసీ)లో సోమవారం నిర్వహించిన ఆటల పోటీలు ఉత్సాహభరితంగా సాగాయి. ఎన్టీఆర్ జిల్లా యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలను ఆంధ్రప్రదేశ్ యూత్ సర్వీసెస్ మేనేజింగ్ డైరెక్టర్ కె.శారదాదేవి ప్రారంభించారు. మ్యూజికల్ చైర్, లెమన్‌స్పూన్, స్కిప్పింగ్, హ్యాపింగ్ పోటీల్లో పాఠశాల విద్యార్థినులు తలబడ్డారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. యువజన సర్వీసుల శాఖ ఎన్టీఆర్ జిల్లా సీఈవో యు.శ్రీనివాసరావు, కార్యాలయ సూపరింటెండెంట్ పి.వి.రాఘవశర్మ, అసిస్టెంట్ మేనేజర్ ఎన్.నాగేశ్వరరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్.రమేష్ ఈ పోటీలను పర్యవేక్షించారు.



స్కిప్పింగ్ పోటీల్లో తలపడుతున్న ఏపీఎస్ఆర్ఎంసీ విద్యార్థినులు

వర్గీకరణపై నమ్మించి మోసం చేసిన బీజేపీ

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ

గన్నవరం: ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించే విషయంలో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరికి నిరసనగా ఉద్యమాలను తీవ్రతరం చేస్తామని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ హెచ్చరించారు. స్థానిక కొత్తపేటలోని బీసీ కమ్యూనిటీ హాలులో సోమవారం మాదిగల ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పిస్తామని చెప్పిన బీజేపీ వంద నెలలైనా పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. యూపీఏ ప్రభుత్వంలో వర్గీకరణకు అనుకూలంగా లేఖలు రాసిన బీజేపీ పెద్దలు ఇప్పుడు ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న జాప్యం వలన మాదిగ యువత విద్య, ఉద్యోగ పరంగా తీవ్రంగా నష్టపోతున్నారని చెప్పారు. కేంద్రం నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ మాదిగలు, మాదిగ ఉపకులాలను ఏకతాటిపైకి తీసుకువచ్చి వర్గీకరణ సాధన దిశగా ముందుకు వెళ్తామని తెలిపారు. దీనిలో భాగంగా ఈ నెల 27, 28 తేదీల్లో ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద దీక్ష, వచ్చే నెల 3న హైదరాబాద్, విజయవాడ బీజేపీ కార్యాలయాల ముట్టడి, 4న నగరాల దిగ్బంధం కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. సంఘ నాయకులు మంద వెంకటేశ్వరరావు, ముమ్మిడి వరపు చినసుబ్బారావు, మంద వేణుబాబు, కోట దానియేలు తదితరులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న కృష్ణమాదిగ

నీటి వనరులను కాపాడుకోవడం మన బాధ్యత

గన్నవరం: నీటి వనరులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కేసరపల్లి గ్రామ సర్పంచి చేబ్రోలు లక్ష్మీమౌనిక పిలుపునిచ్చారు. ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా సోమవారం ఎన్టీఆర్ పశువైద్య కళాశాల ఎన్‌సీసీ వింగ్ ఆధ్వర్యంలో ఊర చెరువు పరిసరాల్లో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌సీసీ క్యాడెట్లతో కలిసి సర్పంచ్, అధికారులు చెరువు చుట్టూ చెత్తా చెదారాన్ని తొలగించి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ భవిష్యత్ తరాలను దృష్టిలో పెట్టుకుని చెరువులు కాలుష్యం బారిన పడకుండా పరిరక్షించుకోవాలని చెప్పారు. సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా ఎన్‌సీసీ విద్యార్థులు గ్రామంలో ప్రధాన సాగునీటి వనరైన చెరువును శుభ్రం చేయడం అభినందనీయమన్నారు. కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ శ్రీదేవి, ఎన్‌సీసీ లెఫ్టినెంట్ కల్నల్ సంజయ్ జాదవ్, లెఫ్టినెంట్ డాక్టర్ ఎల్.జయబాల్, వార్డు సభ్యులు మూల్పూరి మాధవన్, జంపన సుబ్బమ్మ, పాస్టర్ అశోక్‌జాన్, ఎన్‌సీసీ ఆఫీసర్లు బ్రహ్మదేవ్, యుగంధర్, పలువురు వలంటీర్లు పాల్గొన్నారు.



చెరువును శుభ్రం చేస్తున్న సర్పంచ్, ఎన్‌సీసీ అధికారులు, క్యాడెట్లు

సంపద కేంద్రాన్ని సమర్థంగా నిర్వహించాలి

కంకిపాడు: చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని సమర్థంగా నిర్వహించాలని జిల్లా పంచాయతీ అధికారి నాగేశ్వర నాయక్ ఆదేశించారు. మండలంలోని పునాదిపాడులో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ఆయన సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వర్మీకం పోస్టు తయారీ, పిట్స్, వ్యర్థాలను వేసే పిట్‌లను నిర్వహించే తీరును పరిశీలించారు. పిట్స్ (కుండీ)లో చెట్ల ఆకులు వేయటం వల్ల ఉపయోగం తక్కువగా ఉంటుందని, త్వరగా కుళ్లిపోయే వాటిని మాత్రమే పిట్స్‌లో వేసుకోవాలని డీపీఓ సూచించారు. కంపోస్టును తయారు చేసి విక్రయించాలన్నారు. తడి చెత్త, పొడి చెత్త సేకరణ బాధ్యతతో చేపట్టాలన్నారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రజల్లో అవగాహన పెంపొందించాలని పేర్కొన్నారు. రాష్ట్రంలో శిక్షణ కేంద్రాల్లో ఒకటిగా ఉన్న పునాదిపాడు సంపద కేంద్రాన్ని సమర్థంగా నిర్వహించాలని, ఇతర ప్రాంతాల నుంచి శిక్షణకు వచ్చే ప్రజాప్రతినిధులు, అధికారులకు స్ఫూర్తిదాయకంగా నిలవాలని కోరారు. తనిఖీలో ఈఓ బి.వెంకటేశ్వరరావు, మునిరాజు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

